సాక్షి ఆదిలాబాద్
ఆదివారం | 29 | డిసెంబర్ | 2024


కల్యాణోత్సవంలో భూనీలాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి మూర్తులు

గరిష్టం/కనిష్టం 28.0/18.0

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. తేమ శాతం పెరగనుంది. వేకువజామున పొగ మంచు ప్రభావం కనిపించనుంది.

కల్యాణం.. కమనీయం


కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తజనం


స్వామివారి లడ్డూను వేదిక పైకి తీసుకువస్తున్న వేద పండితులు , భక్తులు

గోవింద నామస్మరణతో భక్తజనం పులకించిపోయారు. శ్రీనివాసుని కల్యాణోత్సవాన్ని వీక్షించి తన్మయత్వం చెందారు. జిల్లాకేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో కొనసాగుతున్న 85వ అయుత మహాచండీ యాగంలో భాగంగా శనివారం శ్రీ భూనీలావేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ కల్యాణ ఘట్టాన్ని వైభవోపేతంగా నిర్వహించగా తిలకించేందుకు భక్తజనం భారీగా తరలివచ్చారు. ఇందులో కృష్ణ జ్యోతి స్వరూపానందస్వామి, ఆధ్యాత్మికవేత్తలు, పలువురు రాజకీయ నాయకులు పాల్గొన్నారు. – ఆదిలాబాద్

న్యూస్‌రీల్

డీఆర్డీవోగా రవీందర్ బాధ్యతలు


బాధ్యతలు స్వీకరించిన రవీందర్

కైలాస్‌నగర్: జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి (డీఆర్డీవో)గా రాథోడ్ రవీందర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆ సంస్థ కార్యాలయంలో బదిలీపై వెళుతున్న సాయన్న నుంచి బాధ్యతలు స్వీకరించి విధుల్లో చేరారు. కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం డీపీఎం, ఏపీఎంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శాఖ ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, పథకాలపై ఆరా తీశారు. వాటిని పకడ్బందీగా అమలు చేసేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని సూచించారు.

'నాల్గో తరగతి' సంఘ వ్యవహారాలపై విచారణ

కైలాస్‌నగర్: తెలంగాణ నాల్గో తరగతి తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ వ్యవహారాలు, ఆర్థికపరమైన అంశాలపై విచారణ జరిపించేందు కోసం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముగ్గురు సభ్యులతో కూడిన విచారణ కమిటీని నియమించారు. ఈ కమిటీ సభ్యులు దాసరి నాయక్, రామస్వామి, భిక్షమయ్య శనివారం జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. స్థానిక సంఘ భవనంలో సంఘ బాధ్యులు, నాల్గో తరగతి ఉద్యోగులతో సమావేశం నిర్వహించి ఆయా అంశాలపై ఆరా తీశారు. కాగా అన్ని శాఖల్లోని అటెండర్ల సభ్యత్వాన్ని నమోదు చేయాలని, మడిగెల అద్దె పేపర్ ప్రకటన, లీజు వ్యవహారాలు రద్దు చేయాలని కోరుతూ పలువురు ఉద్యోగులు వారికి వినతిపత్రం అందజేశారు. జిల్లా కార్యవర్గ ఎన్నికలను జేఏసీకి అప్పగించాలని, అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన వ్యక్తి అధ్యక్షుడి హోదాలో ఎలాంటి సమావేశాలు నిర్వహించకుండా చూడాలని కోరారు. కాగా, విచారణ కమిటీ నివేదికను సంఘం రాష్ట్ర అధ్యక్షుడికి అందజేస్తామని వారు పేర్కొన్నారు.

టీబీ రహిత సమాజానికి కృషి చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: టీబీ రహిత సమాజానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. వంద రోజుల టీబీ, నిక్షయ్ శివిర్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని జిల్లా జైలులో ఖైదీలకు టీబీపై శనివారం అవగాహన కల్పించారు. పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి జైలుకు వచ్చిన ఖైదీలకు సికిల్‌సెల్, మధుమేహ పరీక్షలు జరిపారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ, వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ అశోక్ కుమార్, జిల్లా టీబీ నియంత్రణ అధికారి సుమలత, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి శ్రీధర్, వైద్యులు సాయిప్రియ, సయ్యద్ అన్సారి, డిప్యూటీ జైలర్ రాథోడ్ కృష్ణ, ట్రెయినీ డిప్యూటీ జైలర్ ప్రేమ్ కుమార్, జైలు వైద్యులు ఫాతిమా, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి


ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

కైలాస్‌నగర్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్‌-వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జీపీ కార్మికులు శనివారం ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ఆరు నెలలుగా వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. జీవోనంబర్ 51ను సవరించి మల్టీపర్పస్ విధానం రద్దు చేసి, కేటగిరీల వారీగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతీ నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలన్నారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించని పక్షంలో సమ్మెకు దిగుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్మికులు ఇంద్రాజ్, లక్ష్మన్న, రాజు, రఫీ, మోహన్, అరవింద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కలిసిరాని కాలం..!

రైతన్నకు ఈ ఏడాది కూడా కాలం కలిసి రాలేదు. ఏటా అన్నదాత ఏదో విధంగా నష్టపోతూనే ఉన్నాడు. ఓ సంవత్సరం అతివృష్టి అయితే మరో సంవత్సరం అనావృష్టి వెంటాడుతోంది. పంట పండితే గిట్టుబాటు ధర ఉండదు.. ధర ఉంటే దిగుబడి లేని పరిస్థితులు. ఈ సారి కురిసిన భారీ వర్షాలతో పత్తి, సోయా పంటలు దెబ్బతిన్నాయి. దీంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తి బేళ్లకు తక్కువ ధర ఉండడంతో మద్దతు ధరకు మించి కొనుగోలు చేసేందుకు ప్రైవేట్ వ్యాపారులు ముందుకు రాలేదు. సీసీఐ మద్దతు ధరతో కొనుగోలు షురూ చేసింది. అయితే తేమ వంటి నిబంధనలతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పశుసంవర్ధక శాఖ ద్వారా రైతులకు ఈ ఏడాది కూడా ప్రయోజనం చేకూరలేదు. గడ్డి విత్తనాలను 75 శాతం సబ్సిడీపై మాత్రమే ఇచ్చారు. – ఆదిలాబాద్‌టౌన్

- అధిక వర్షాలతో పంటలకు నష్టం
- పత్తికి దక్కని మద్దతు ధర
- అన్నదాత దరిచేరని రైతు భరోసా
- అందరికీ వర్తించని రుణమాఫీ


ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో ఆందోళన చేస్తున్న రైతులు (ఫైల్)

50 శాతమే చేప పిల్లల లక్ష్యం..

జిల్లాలో ఈ ఏడాది చేప పిల్లల పెంపకానికి సంబంధించి 50 శాతం లక్ష్యం మాత్రమే ఇచ్చారు. అందులో చేపలు చనిపోవడం, వివిధ కారణాలతో 30 శాతం మించి లక్ష్యం నెరవేరలేదని తెలుస్తోంది. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో 240 చెరువులు ఉండగా, 126 చెరువుల్లో మాత్రమే చేప పిల్లలను వేశారు. 87 లక్షలకు గాను 43లక్షల చేప పిల్లలను మాత్రమే వదిలారు. ఏటా మార్చి, ఏప్రిల్‌లో చేపలు విక్రయానికి వస్తాయి. అయితే ఈ ఏడాది జూన్ నాటి వరకు వచ్చే పరిస్థితి లేదని మత్స్యకారులు చెబుతున్నారు.

రివైండ్ 2024 వ్యవసాయం

రెండేళ్లుగా రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ ఏడాది అతివృష్టితో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పెట్టుబడి రాక రైతుకు అప్పులే మిగిలాయి. ఈ సంవత్సరం జిల్లాలో 4లక్షల 34వేల ఎకరాల్లో పత్తి, 71,226 ఎకరాల్లో సోయా, 52వేల ఎకరాల్లో కంది సాగు చేశారు. ఆగస్టులో కురిసిన వర్షాలకు దాదాపు 6వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. పూత, కాత రాలిపోయి దిగుబడిపై ప్రభావం చూపింది. ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా, ఐదారు క్వింటాళ్లకు మించలేదు. సోయా ఎకరానికి 7 నుంచి 8 క్వింటాళ్లు రావాల్సి ఉండగా, 2 నుంచి 3 క్వింటాళ్లు మాత్రమే వచ్చిందని రైతులు చెబుతున్నారు. మార్కెట్లో సీసీఐ పత్తి రైతులకు చుక్కలు చూపించింది. ఈనెల 31 నుంచి మద్దతు ధర రూ.7,521లో నుంచి రూ.50 కోత విధిస్తున్నట్లు ఇప్పటికే ప్రకటన జారీ చేసింది. అక్టోబర్ 25న ఆదిలాబాద్‌లో పత్తి కొనుగోళ్లు ప్రారంభించగా, మొదటి రోజు తీవ్ర ప్రతిష్టంబన నెలకొంది. మద్దతు ధర కోసం రైతులు ఆందోళనకు దిగారు. తొలిరోజు క్వింటాలుకు రూ.7200తో ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేశారు. ఆ తర్వాత రూ.7వేలకు మించి ధర చెల్లించలేదు. ఈ ఏడాది జిల్లాలో సీసీఐ ద్వారా 15లక్షల 8వేల 368 క్వింటాళ్లు, ప్రైవేట్ వ్యాపారులు లక్ష 44వేల 573 క్వింటాళ్ల మేరే కొనుగోలు చేశారు. మొత్తం 16లక్షల 60వేల క్వింటాళ్ల వరకు పత్తి కొనుగోళ్లు జరిగాయి.

పూర్తిస్థాయిలో కాని రుణమాఫీ..
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా రైతు రుణమాఫీ చేసింది. జిల్లాలో లక్ష 20వేల మంది రైతులు రుణాలు పొందగా, వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం 64వేల మందికి రూ.2లక్షల లోపు మాఫీ జరిగిందని చెబుతున్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం రూ.678 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొంటున్నారు. రూ.2లక్షల పైగా రుణం పొందిన రైతులకు మాఫీ కాకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రూ.2లక్షల లోపు రుణాలు తీసుకున్న వారికి కూడా పూర్తిస్థాయిలో మాఫీ కాని వారు ఆందోళన చేపట్టారు. వీరికి బీఆర్ఎస్, బీజేపీతో పాటు ఆయా పార్టీల నాయకులు మద్దతు తెలిపారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన రైతన్నల కోసం రామన్న పోరుబాట కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు. రైతుల సమస్యలపై పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా గత ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు కార్యక్రమం ముందుకు సాగలేదు. రైతు భరోసా పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఖాతాల్లో పంట పెట్టుబడి సాయం అందజేస్తామని ప్రకటించింది. అయితే హామీని ఇప్పటివరకు నెరవేర్చలేదు. ఇటీవల ముఖ్యమంత్రి సంక్రాంతి తర్వాత రైతు భరోసా అందిస్తామని ప్రకటించారు.

నిరాశలో అన్నదాతలు..
ఈఏడాది అన్నదాతలకు కలిసిరాకపోవడంతో నిరాశలో ఉన్నారు. దీనికితోడు ప్రభుత్వం పంట బీమా ఇన్సూరెన్స్‌ను చెల్లిస్తామని ప్రకటించినా అమలు చేయలేదు. రైతులకు ఎలాంటి రాయితీలు కల్పించలేదు. యాంత్రీకరణకు సంబంధించిన పరికరాలు అందించలేదు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10వేల చొప్పున పరిహారం చెల్లించారు. జిల్లాలో 109 గ్రామాలకు సంబంధించి 2,041 మందికి పరిహారం అందింది.

వ్యవసాయ శాఖలో పోస్టుల భర్తీ పరిస్థితి..
వ్యవసాయ శాఖలో జిల్లాలో ఖాళీగా ఉన్న మండల వ్యవసాయ అధికార పోస్టులు భర్తీఅయ్యాయి. కొత్తగా పది ఏవోల నియామకం జరిగింది. అలాగే నాలుగు ఏడీఏ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో పాటు జిల్లా వ్యవసాయ అధికారి పోస్టు కొన్నేళ్లుగా ఇన్‌చార్జీలతోనే కొనసాగుతుంది. బోథ్, ఇచ్చోడకు సంబంధించిమాత్రమే రెగ్యులర్ ఏడీఏలు ఉన్నారు.


విత్తన గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్ (ఫైల్)

ఈ ఏడాది రైతులు పత్తి విత్తనాల కొనుగోలు కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డిమాండ్ రకమైన రాశీ సీడ్స్ కోసం ఆందోళనలు సైతం చేపట్టారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపి వాటిని మండల కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. అలాగే జిల్లాలో పలుచోట్ల నకిలీ విత్తనాలు పట్టుబడ్డాయి.

విత్తనాల కోసం తంటాలు..

ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్‌లో పెద్ద ఎత్తున తరలిస్తున్న ముఠాను మావల పోలీసులు పట్టుకున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో నకిలీ విత్తనాలు అమ్ముతున్న వారిపై పోలీసులు, వ్యవసాయ అధికారులు కొరడా ఝులిపించారు. ఈ ఏడాది కూడా రైతులకు నకిలీ విత్తనాల బెడద తప్పలేదు.

'సమగ్ర' సమ్మెకు బీఆర్ఎస్ మద్దతు

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్
- దీక్ష శిబిరాన్ని సందర్శించి ఉద్యోగులకు సంఘీభావం


సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

కైలాస్‌నగర్: సమస్యల పరిష్కారం కోసం సమగ్ర ఉద్యోగులు చేపట్టిన సమ్మెకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె 19వ రోజుకు చేరింది. కలెక్టరేట్ ఎదుట గల సమ్మె శిబిరాన్ని ఎమ్మెల్యే శనివారం సందర్శించి సంఘీభావం ప్రకటించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో సెల్‌ఫోన్‌లో మాట్లాడించి వారి సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తామనే భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చాయ్ తాగేలోపు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామన్న హామీని సీఎం ఎందుకు నిలుపుకోవడం లేదని ప్రశ్నించారు. సమగ్ర ఉద్యోగులకు న్యాయం జరిగేంత వరకు వారి పోరాటానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రూ.50వేల ఆర్థిక సాయం అందజేయనున్నట్లు ప్రకటించారు. అంతకు ముందు తమను విద్యాశాఖలో విలీనం చేసి సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట మోకాళ్లపై నిలబడి అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు. ఇందులో రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్, అధ్యక్షురాలు ప్రియాంక, కార్యదర్శి ధరంసింగ్, శ్రీకాంత్, కేశవ్, ప్రశాంత్‌రెడ్డి, ప్రకాశ్, దేవదర్శన్, మమత, సురేందర్, వెంకటి, పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణపై దృష్టి సారించాలి

- కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): విద్యార్థులు ఆరోగ్య సంరక్షణపై దృష్టి సారించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్ పాఠశాలను శనివారం సందర్శించారు. 'ఆరోగ్య పాఠశాల లక్ష్మీపూర్ బడి' అనే కథల పుస్తకాన్ని విద్యార్థులు రచించగా,కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలుతీరుపై ఆరా తీశారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై దృష్టి సారిస్తారన్నారు. కలెక్టర్ వెంట డీఈవో ప్రణీత తదితరులున్నారు.

పత్తి పంటను పరిశీలించిన కలెక్టర్..
అనంతరం గ్రామంలో పత్తి పంటను కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలో డిసెంబర్ తర్వాత గులాబీపురుగు ఉధృతి ఉంటుందని, దీంతో రైతులు నష్టం చవిచూసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. శాస్త్రవేత్తల సూచనలమేరకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట శాస్త్రవేత్తలు రాజశేఖర్, వ్యవసాయ అధికారులు విశ్వమిత్ర, పూజ, సాయితేజ రెడ్డి ఉన్నారు. అంతకుముందు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.


విద్యార్థులు రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

జిల్లాలో110 విజయ పాల విక్రయకేంద్రాలు

కైలాస్‌నగర్: రాష్ట్రంలోనే తొలిసారిగా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 85, పట్టణ పరిధిలో25 విజయ పాల విక్రయ కేంద్రాలను మహిళా సంఘాల ద్వారా ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షిషా అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో విజయ సఖి నమూనా ఫ్రీజ్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరా మహిళా శక్తిలో భాగంగా పట్టణ ప్రాంతాల్లో కిరాణ వర్తక రంగంలో ఉన్నటువంటి 15 మహిళా బృందాలను గుర్తించామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘాల బృందాలను గుర్తించాలని డీఆర్డీవోను ఆదేశించారు.త్వరలోనే ఆదిలాబాద్ బస్టాండ్‌లో మెప్మా ఆధ్వర్యంలో విజయ డెయిరీ పార్లర్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ట్రెయినీ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవియా, విజయ డెయిరీ డీడీ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

వసతులు పరిశీలించి నివేదిక అందించాలి
టెంటెటివ్ లేఅవుట్లలో కల్పించిన వసతులను కమిటీ సభ్యులు పరిశీలించి నివేదిక అందించాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. తెలంగాణ మున్సిపల్ ల్యాండ్ డెవలప్‌మెంట్ జిల్లా స్థాయి లేఅవుట్ కమిటీ సమావేశాన్ని శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నిర్వహించారు.లేఅవుట్లలోని ప్లాట్లు,కల్పించిన మౌలిక వసతులు పరిశీలించి సమగ్ర నివేదిక అందజేయాలన్నారు. అన్ని వసతులు కల్పించిన, నిబంధనల ప్రకారం ఉన్నటువంటి లేఅవుట్‌లకు మాత్రమే ఆమోదం తెలపనున్నట్లు తెలిపారు.

టీషర్ట్‌లు అందజేసి.. బెస్టాఫ్ లక్ చెప్పి

కైలాస్‌నగర్: సీఎం కప్‌-2024లో భాగంగా రెండో విడత జిల్లా స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు ఈ నెల 29, 30వ తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. వీరంతా హైదరాబాద్, మహబూబ్‌నగర్, మెదక్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్, హన్మకొండ జిల్లాలకు ఆదివారం ప్రత్యేక బస్సుల్లో బయలుదేరి వెళ్లనున్నారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో యూనిఫాం టీ షర్ట్‌లను కలెక్టర్ అందజేసి వారికి బెస్ట్ ఆఫ్ లక్ తెలిపారు. రాష్ట్ర స్థాయి క్రీడల్లోనూ రాణించి జిల్లా పేరు నిలబెట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, గిరిజన క్రీడల అధికారి పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులతో కలెక్టర్ రాజర్షి షా

చేయి తడిపితేనే రుణం!

- ఆర్‌పీ, సీవోల అక్రమ వసూళ్లు
- లబోదిబోమంటున్న ఎస్‌హెచ్‌జీ సభ్యులు
- ఆదిలాబాద్ మెప్మాలో అక్రమాల పర్వం
- కరువైన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

కైలాస్‌నగర్: మహిళా సాధికారతే లక్ష్యంగా పనిచేయాల్సిన పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లో వసూళ్ల పర్వం కొనసాగుతోంది. ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంకుల ద్వారా రుణాలందించి వారి అభ్యున్నతికి పాటుపడాల్సిన కొంతమంది మెప్మా సిబ్బంది వసూళ్లకు తెరలేపారు. రుణాలు తీసుకునే ముందు నుంచి ఎస్‌హెచ్‌జీ సభ్యులతో బేరసారాలకు దిగుతున్నారు. తమను చూసుకుంటే తాము రుణాలు త్వరగా ఇప్పిస్తామని, రుణ పరిమితి కూడా పెంచేలా చూస్తామంటూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. అయితే డబ్బులివ్వకుంటే రుణం రాదేమోననే భయంతో కొంతమంది ముట్టజెబుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఈ వ్యవహారం సాగుతున్నట్లుగా తెలుస్తోంది.

వసూళ్లకు పాల్పడుతున్న ఆర్పీలు, సీవోలు..
మెప్మా ద్వారా ఏటా పట్టణ పరిధిలోని స్వయం సహాయక సంఘాలకు రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు బ్యాంకుల ద్వారా రుణాలు అందజేస్తుంటారు. ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు అందించే ఈ రుణాల మంజూరుకు గాను కొంతమంది రిసోర్స్ పర్సన్లు, సీవోలు వసూళ్లకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా చదువురాని అమాయక మహిళలే లక్ష్యంగా అక్రమాలకు ఒడిగడుతున్నారు. తామెందుకు డబ్బులివ్వాలని ఎవరైనా ప్రశ్నిస్తేఎక్కడికి వెళ్లి రుణాలు తెచ్చుకుంటారో తెచ్చుకొమ్మంటూ బెదిరింపులకు దిగుతున్నారని సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు చేస్తే తమకు ఎక్కడ రుణాలు అందవేమోనని వెనుకంజ వేస్తున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న సిబ్బంది అందిన కాడికి దండుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వసూళ్లపై పలువురు కౌన్సిలర్లు, సహచర సిబ్బందే బాహాటంగా చర్చించుకోవడం గమనార్హం.

అక్రమాలు ఇలా..
మెప్మాలో వార్డు స్థాయిలో రిసోర్స్ పర్సన్లు పని చేస్తారు. ఒక్కో ఆర్పీ ఆధీనంలో 20 నుంచి 30 సంఘాలున్నాయి. అందులోని సభ్యులకు వివిధ బ్యాంకుల ద్వారా రుణాలందించేలా శ్రద్ధ వహిస్తూ వారికి ఆర్థిక చేయూతనందించేలా చూడాల్సిన బాధ్యత ఆర్పీలది. వీరంతా కమ్యూనిటీ ఆర్గనైజర్ (సీవో)ల ఆధీనంలో పనిచేయాల్సి ఉంటుంది. వీరిని పర్యవేక్షించేందుకు టీఎంసీ ఉండగా జిల్లా స్థాయిలో డీఎంసీ, ప్రాజెక్ట్ డైరెక్టర్ పనిచేస్తుంటారు. సంఘాల వివరాలతో పాటు రుణాల మంజూరుకు సంబంధించిన పనులను ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. రుణాల మంజూరుకు సంబంధించిన ప్రక్రియ ముందుకు సాగాలంటే తమ చేయి తడపాల్సిందనేలా కొంతమంది ఉద్యోగులు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఆర్పీలు ఎంసీపీ (మైక్రో క్రెడిట్ ప్లాన్)కోసం ఆపరేటర్లను సంప్రదించాల్సి ఉంటుంది. ఇందుకోసం సంఘాల నుంచి రూ.500 నుంచి రూ.వెయ్యి తీసుకుని ఎంసీపీని అందజేస్తున్నారు. తర్వాత సీవోలు, ఉన్నతాధికారులు సంతకాలు చేయాల్సి ఉంటుంది. ఇలా సంతకం పెట్టేందుకు కింది నుంచి పైవరకు కొంతమంది చేయి చాపుతుండగా ఇకొంతమంది మనకేందుకులే అనే భావనతో బాధ్యతతో పనిచేస్తున్నారు. ఇలా రిసోర్స్ పర్సన్లు సంఘాలకు ఇప్పించే రుణాల నుంచి 1నుంచి 2 శాతం వరకు వసూలు చేస్తున్నారనే విమర్శలువ్యక్తమవుతున్నాయి. రూ.10లక్షల నుంచి రూ.20లక్షల రుణాలు మంజూరైన సంఘాల నుంచి రూ.10 నుంచి రూ.15వేలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొంతమంది నగదుగా చెల్లిస్తే మరికొంతమంది ఫోన్ పే, గూగుల్‌పే ద్వారా చెల్లిస్తూ లబోదిబోమంటున్నారు. ఈ అక్రమ వసూళ్లపై పలువురు కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసిన సందర్భాలూ లేకపోలేదు. అయితే రెగ్యులర్ పీడీ లేకపోవడం, జిల్లా ఉన్నతాధికారులు మెప్మా విభాగంపై అంతగా దృష్టి సారించకపోవడంతో ఈ అక్రమాల పర్వం యథేచ్ఛగా సాగుతున్నట్లుగా తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేయాలని స్వయం సహాయక సంఘాల సభ్యులు కోరుతున్నారు.


మున్సిపాలిటీలోని మెప్మా విభాగం కార్యాలయం



ఓ సీవోకు డబ్బులు ఫోన్ పే చేశారిలా..

నా దృష్టికి రాలేదు..

మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకు రుణాల మంజూరు కోసం సిబ్బంది డబ్బులు తీసుకుంటున్న విషయం ఇప్పటి వరకైతే నా దృష్టికి రాలేదు. సేవ రుసుంగా లక్షకు రూ.500 ఆర్‌పీలు తీసుకుని వాటికి రశీదు ఇస్తారు. ఇలా తీసుకున్న డబ్బులు ఎస్ఎల్ఎఫ్ అకౌంట్‌లో జమ చేసి కార్పస్ ఫండ్‌గా ఉపయోగిస్తారు. వాటి రిజిస్టర్లను కూడా నిర్వహించాల్సి ఉంటుంది. అంతకు మించి ఎలాంటి డబ్బులు తీసుకోకూడదు. ఎవరైనా సిబ్బంది వసూలు చేస్తే మహిళా సభ్యులు తనతో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం.
– శ్రీనివాస్, మెప్మా డీఎంసీ, ఆదిలాబాద్

సీవోఈ నోటిఫికేషన్ ఎప్పుడో?

- విడుదలలో జాప్యం
- ఎదురుచూస్తున్న విద్యార్థులు
- 'పది'లో మార్కుల ఆధారంగా ప్రవేశాలనే ప్రచారం
- అధికారిక ప్రకటన లేక ఊహాగానాలు


బెల్లంపల్లి సంక్షేమ బాలుర సీవోఈ కళాశాల ముఖద్వారం

బెల్లంపల్లి: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ) కళాశాలల్లో 2025–26 విద్యాసంవత్సరంలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి నోటిఫికేషన్ కోసం విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, సంక్షేమ, జనరల్ గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి ఉమ్మడి ప్రవేశపరీక్షకు ఈనెల 18న నోటిఫికేషన్ విడుదల కాగా, సీవోఈలో ప్రవేశానికి నోటిఫికేషన్ జారీలో జాప్యం జరుగుతోంది. ఏటా డిసెంబర్ రెండు లేదా మూడో వారంలో నోటిఫికేషన్ విడుదల చేస్తుండగా ఈసారి ఆలస్యం అవుతుండటంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పదో తరగతిలో సాధించిన మార్కుల ప్రాతిపదికన విద్యార్థులకు ఈసారి అడ్మిషన్ కల్పిస్తారనే ప్రచారం జరుగుతోంది. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) ఈవిషయంలో అధికారికంగా ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయకపోయినప్పటికీ రకరకాలుగా ఊహాగానాలు వస్తున్నాయి. ఈకారణంగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో పది వార్షిక పరీక్షలు రాయబోతున్న విద్యార్థులు ఎటూ తేల్చుకోలేక సతమతమవుతున్నారు. సీవోఈ ప్రవేశపరీక్షకు సిద్ధం కావాలా లేక పదో తరగతి పరీక్ష మెరుగ్గా రాయాలా అనే సందిగ్ధంలో ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలో రెండు సీవోఈలు..

ఉమ్మడి జిల్లాలో సాంఘిక సంక్షేమ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీలు రెండు ఉన్నాయి. మంచిర్యాల జిల్లాలో బెల్లంపల్లి కేంద్రంగా బాలుర సీవోఈ, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బాలికల సీవోఈ కళాశాలలు ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం ప్రవేశపరీక్ష నిర్వహించి వీటిలో మెరిట్ విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారు. ఒక్కో కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో రెండేసి సెక్షన్ల చొప్పున 80 మంది విద్యార్థులకు అడ్మిషన్ కల్పిస్తారు. సాధారణ గురుకులాల కన్నా సీవోఈ కళాశాలల్లో ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఇంటర్ విద్యాబోధన చేస్తూనే నీట్, ఎంసెట్ తదితర పోటీ పరీక్షలకు విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఉన్నతంగా తీర్చిదిద్దుతారు. సీవోఈ కళాశాలల్లో ప్రవేశానికి విద్యార్థుల్లో విపరీతమైన క్రేజీ ఏర్పడి ఏటేటా పోటీ రెట్టింపవుతోంది.

విద్యార్థులకు వరం..

సీవోఈల్లో ప్రవేశం దక్కితే చాలు విద్యార్థుల భవిష్యత్ బంగారు మయమవుతుందనేది తల్లిదండ్రుల ఆశ. ఈకారణంగానే పదో తరగతి చదువుతున్న తమ పిల్లలకు సీవోఈ ప్రవేశపరీక్ష రాయడానికి ప్రత్యేకంగా కోచింగ్ ఇప్పిస్తుండటం చేస్తున్నారు. ప్రవేశం పొందిన విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చదువులో, పోటీ పరీక్షల్లో నెగ్గేలా ఉన్నతంగా తీర్చిదిద్దడంలో సీవోఈలు ప్రత్యేకతను ఏర్పర్చుకున్నాయి. ఈ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు పోటీ పరీక్షలు రాసి ఏటా పదులసంఖ్యలో ఇంజినీరింగ్, మెడిసిన్ సీట్లతోపాటు ఐఐటీలోనూ ప్రవేశం పొందుతున్నారు.

వారంలో వస్తుంది



విద్యార్థులు ఎలాంటి గందరగోళానికి గురికావద్దు. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ కళాశాలల్లో ప్రవేశానికి ఎప్పటిమాదిరిగా ఈసారి ప్రవేశపరీక్ష నిర్వహిస్తాం. పదో తరగతిలో వచ్చిన మార్కుల ప్రాతిపదికన సీటు కేటాయించడం జరగదు. ప్రవేశపరీక్షకు సంబంధించి వారంలో నోటిఫికేషన్ వస్తుంది. విద్యార్థులు పరీక్షకు సిద్ధమై ప్రతిభను చాటుకోవాలి.

– అరుణకుమారి, జోనల్ అధికారి, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ

కార్యదర్శి కక్కుర్తి

- రాజీనామా చేసిన కారోబార్ వేతనం నొక్కేశాడు
- ఆరు నెలల వేతనాలు మరొకరి ఖాతాలో జమ
- విషయం తెలిసి ఫిర్యాదు చేసిన మాజీ కారోబార్

కోటపల్లి: పంచాయతీ కారోబార్‌గా రాజీనామా చేసిన వ్యక్తి పేరిట ఆరునెలల వేతనాలను వేరే వ్యక్తి బ్యాంక్ ఖాతాలో వేయించి కార్యదర్శి నొక్కేశాడు. ఈ ఘటన కోటపల్లి మండల కేంద్రం పంచాయతీలో ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కోటపల్లి పంచాయతీలో 2021–24 వరకు కారోబార్‌గా కొంకటి సుందర్ పనిచేశాడు. వ్యక్తిగత కారణాలతో గత జూన్‌లో రాజీనామా చేశాడు. కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న సత్యనారాయణ.. సుందర్ పేరిట నెల వేతనం రూ.21,450, ఇలా ఆరునెలల వేతనాలను చెన్నూర్ పట్టణానికి చెందిన నలమాసు రమేశ్ అకౌంట్‌లో జమ చేశాడు. విషయం తెలుసుకున్న సుందర్.. కోటపల్లి పంచాయతీ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ మహేంద్రనాథ్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. కోటపల్లి, పంగిడి సోమారం కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణ పంచాయతీ నిధులు స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సదరు కార్యదర్శిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోటపల్లి గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో లక్ష్మయ్య, తహసీల్దార్ మహేంద్రనాథ్ వివరణ కోరగా కార్యదర్శికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. నిధులు రికవరీ చేసి కోటపల్లి ఇన్‌చార్జిగా సత్యనారాయణను తొలగిస్తామన్నారు.

విహారయాత్రలో విషాదం

- కర్ణాటకలోని మైసూరు వద్ద కారు బోల్తా
- ప్రమాదంలో ఇద్దరు మృతి, మరో ఇద్దరికి గాయాలు
- మృతుల్లో మంచిర్యాల యువకుడు

మంచిర్యాలక్రైం: డిసెంబర్ 31 సెలబ్రేషన్స్ కోసం కర్ణాటక వెళ్లిన నలుగురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల విహారయాత్ర విషాదంగా మారింది. సంతోషంగా గడపాలనుకున్న వారి ఆశ మార్గమధ్యలోనే ఆవిరైంది. శనివారం తెల్లవారుజాము మైసూరు సమీపంలో వీరి కారు బోల్తాపడిందని సమాచారం. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మృతుల్లో మంచిర్యాల వాసి యువకుడు ఉన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి..జిల్లాకేంద్రంలోని దొరగారిపల్లెకు చెందిన బల్జపల్లి శంకరమ్మ–వెంకన్న కుమారుడు సందీప్ హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. సందీప్ తన మరో ముగ్గురు స్నేహితులతో కలిసి శుక్రవారం కారులో కర్ణాటకకు బయల్దేరారు. శనివారం వేకువజామున మైసూరు సమీపంలోకి చేరుకోగా అదుపు తప్పి బోల్తాపడినట్లు తెలిసింది. ఈ ప్రమాదంలో సందీప్ మృతి వార్త విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మైసూరు బయల్దేరి వెళ్లారు. సందీప్ మృతితో దొరగారిపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆదివారం సాయంత్రం సందీప్ మృతదేహం మంచిర్యాలకు చేరుకునే అవకాశం ఉంది.


సందీప్ (ఫైల్)

క్లుప్తంగా

వాహనం ఢీకొని కోతి మృతి


మృతి చెందిన కోతి

భీమారం: మంచిర్యాల–చెన్నూరు జాతీయ రహదారిపై శనివారం పోలంపల్లి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో కోతి మృతి చెందింది. వాహనదారులు కోతులకు ఆహారపదార్థాలు వేయగా అవి గుంపుగా వచ్చి తినే ప్రయత్నం చేస్తుండగా వెనుక నుంచి వచ్చిన వాహనం ఢీకొనడంతో ఓ కోతి మృతిచెందింది. వారంలో కనీసం 10కి పైగా కోతులు మృతి చెందుతున్నాయి. ఇప్పటికైనా అటవీ అధికారులు జాతీయ రహదారిపై పెట్రోలింగ్ నిర్వహించి వాహనదారులు ఆహారం వేయకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ


నుజ్జునుజ్జయిన లారీ ముందు భాగం

సోన్: లారీ డివైడర్ ఢీకొట్టిన ఘటన మండలంలోని గంజాల్ టోల్ ప్లాజా వద్ద చోటుచేసుకుంది.. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాలు.. మహారాష్ట్ర నుంచి కేరళలోని కొచ్చిన్‌కు ఫైబర్ డోర్స్ లోడుతో లారీ వెళ్తోంది. శుక్రవారం అర్ధరాత్రి గంజాల్ టోల్‌ప్లాజా వద్ద డ్రైవర్ నిద్రలో జారుకోవడంతో లారీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. లారీ ముందు భాగం నుజ్జునుజ్జయింది. క్లీనర్ అరుణ్ మురుగన్ ఫిర్యాదుతో డ్రైవర్ సర్వరాజ్‌పై శనివారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై షేక్‌అహ్మద్ తెలిపారు.

భార్యపై హత్యాయత్నం

ఆదిలాబాద్‌టౌన్: భార్యపై భర్త తీవ్రంగా దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ కథనం ప్రకారం.. బొక్కల్‌గూడకు చెందిన సయ్యద్ అన్వర్ గత కొంతకాలంగా భార్యను తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నాడు. శనివారం భార్యపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. గాయాలపాలైన ఆమెను కుటుంబీకులు రిమ్స్‌కు తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్వర్‌ను రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ తెలిపారు.

బావిలో దూకి ఆత్మహత్య

తలమడుగు: బావిలో దూకి ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం..ఆదిలాబాద్ పట్టణంలోని దుర్గానగర్‌కి చెందిన గంగన్న (41) బతుకుదెరువు కోసం మూడు నెలల క్రితం తలమడుగు మండలం రుయ్యాడి గ్రామానికి వలసవచ్చాడు. కూలీ పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగవద్దని భార్య మందలించడంతో క్షణికావేశంలో శనివారం రాత్రి రుయ్యాడి సమీపంలో బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజమ్మ తెలిపారు.

నిర్మల్‌లో వివాహితపై లైంగికదాడి

- భర్తతో గొడవపడి బయటకు వచ్చిన మహిళ
- లాడ్జికి తీసుకెళ్లి ఓ వ్యక్తి అఘాయిత్యం
- బాధితురాలికి ఎస్పీ జానకీ షర్మిల పరామర్శ


బస్టాండ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల, డీఎస్పీ గంగారెడ్డి, సీఐ ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌టౌన్: నిర్మల్ జిల్లా కేంద్రంలో వివాహితపై లైంగికదాడి జరిగింది. రాత్రి సమయంలో భర్తతో గొడవపడి బయటకు వచ్చిన ఆమె నిస్సహాయతను ఆసరాగా చేసుకుని ఓ వ్యక్తి లాడ్జికి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధిత మహిళ తెలిపిన వివరాల ప్రకారం... జిల్లా కేంద్రానికి చెందిన మహిళ భర్తతో గొడవపడి శుక్రవారం రాత్రి 11గంటల ప్రాంతంలో బస్టాండ్‌కు వచ్చింది. అక్కడ యోగేష్ అనే వ్యక్తి ఆమెకు పరిచయం అయ్యాడు. డబ్బులు అవసరం ఉన్నాయని ఆమె అడుగగా.. యోగేష్ తనకు పరిచయం ఉన్న కళ్యాణ్ అనే వ్యక్తికి ఫోన్ చేసి రప్పించాడు. బస్టాండ్‌కు వచ్చిన కళ్యాణ్ ఆమెను పట్టణంలోని ఓ లాడ్జికి తీసుకెళ్లాడు. లొంగదీసుకోవాలని ప్రయత్నించగా ఆమె నిరాకరించింది. దీంతో ఆమెపై బలవంతంగా లైంగికదాడికి పాల్పడ్డాడు. అనంతరం బస్టాండ్‌కు వచ్చిన మహిళ ఓ ఆటోలో స్పృహకోల్పోయి పడిపోయింది. ఆటోడ్రైవర్ అక్కడే ఉన్న బ్లూకోల్ట్స్ సిబ్బందికి సమాచారం అందించాడు. వెంటనే ఆ మహిళను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ జానకీ షర్మిల శనివారం ఆమెను ఆస్పత్రిలో పరామర్శించారు. అనంతరం బస్టాండ్ ప్రాంతంలోని ఘటన స్థలాన్ని క్లూస్ టీం సిబ్బందితో కలిసి పరిశీలించి వివరాలు సేకరించారు. రాత్రి సమయంలో డ్యూటీ చేసే పోలీసులకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు.

ఘటనపై మంత్రి సీతక్క ఆరా

జిల్లా కేంద్రంలో వివాహితపై జరిగిన అత్యాచార ఘటన గురించి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క శనివారం రాత్రి ఆరా తీశారు. ఎస్పీ జానకీ షర్మిలతో ఫోన్‌లో మాట్లాడారు. అత్యాచారానికి పాల్పడినవారు ఎంతటి వారైనా ఉపేక్షించొద్దని ఆదేశించారు.

బెల్లంపల్లి అభివృద్ధికి 'సొసైటీ' నిధి..!

- అప్పట్లో రూ.6 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్
- రూ.40 లక్షలకు చేరిన వైనం..


సమావేశమైన ప్రస్తుత కమిటీ సభ్యులు (ఫైల్)

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ప్రజోపయోగ అవసరాల రీత్యా సారా కాంట్రాక్టర్ల వద్ద నుంచి వసూలు చేసిన చందా డబ్బులు బ్యాంకులో భద్రంగా ఉన్నాయి. నాలుగు దశాబ్దాల క్రితం అప్పటి రాజకీయ, కార్మిక, వ్యాపార, పుర ప్రముఖులు ఏకమై బ్యాంకులో రూ.6 లక్షలు ఫిక్స్‌డ్ చేయగా ప్రస్తుతం రూ.40 లక్షల వరకు చేరుకున్నాయి. వీటిని భవిష్యత్ ప్రజోపయోగ కార్యక్రమాలకు ఖర్చు చేయాలనే పట్టుదలతో ఉండగా, సరైన అవసరాలను గుర్తించడంలో నిర్లక్ష్యం జరుగుతోంది.

ముగ్గురు సభ్యుల సంతకాలతో..

రూ.6 లక్షల చందా డబ్బులను అప్పటి స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ (ప్రస్తుత ఎస్బీఐ) బెల్లంపల్లి శాఖ బ్యాంకులో ఫిక్స్‌డ్ చేశారు. కమిటీ సభ్యులు తాటిపాముల నాగయ్య, గోనే శ్యాంసుందర్‌రావు, రతన్‌లాల్ ఈ ముగ్గురిలో ఇద్దరు సంతకం చేసి డబ్బులు విత్ డ్రా చేసేలా నిర్ణయించారు. ఇప్పటివరకు రూ.5 లక్షల వరకు విత్‌డ్రా చేసి ఖర్చుపెట్టారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ, అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.4 లక్షలు, భారత స్వర్ణోత్సవ వేడుకల నిర్వహణకు రూ.లక్ష వెచ్చించారు. మిగతా డబ్బులు బ్యాంకులో నిల్వ ఉండటం గమనార్హం.

1982లో సొసైటీ రిజిస్ట్రేషన్

సింగరేణి బొగ్గు గనులతో 1980లో బెల్లంపల్లి ఎంతగానో విరాజిల్లింది. పారిశ్రామిక క్షేత్రంగా ఉన్న బెల్లంపల్లిని విద్యా, సాంస్కృతిక పరంగా అభివృద్ధి చేసుకోవాలనే లక్ష్యంతో 'ది బెల్లంపల్లి ఎడ్యుకేషనల్, కల్చరల్, సోషల్ డెవలప్‌మెంట్ సొసైటీ'ని ఏర్పాటు చేసి 1982లో రిజిస్ట్రేషన్ చేయించారు. సొసైటీ చైర్మన్‌గా బాశెట్టి గంగారాంను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా అప్పటి మాజీ ఎమ్మెల్యేలు గుండా మల్లేశ్, దాసరి నర్సయ్య, రాజకీయ, కార్మిక నాయకులు బాశెట్టి గంగారాం, తాటిపాముల నాగయ్య, చిప్ప నర్సయ్య, నామసాని రామారావు, వ్యాపార వర్గాలు రతన్‌లాల్, తేజ్ ప్రకాశ్, మంచిర్యాలకు చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు గోనే శ్యాంసుందర్‌రావు, అప్పటి బడా సారా కాంట్రాక్టర్ కె.సాగర్‌రావు ఉన్నారు. కాగా, కమిటీ సభ్యుల్లో గుండా మల్లేశ్, డి.నర్సయ్య, బి.గంగారాం, టి.నాగయ్య, ఎన్.రామారావు, రతన్‌లాల్ మృతిచెందారు.

నిర్దేశిత లక్ష్యాలు

బెల్లంపల్లి అభివృద్ధికి కమిటీ సభ్యులు పలు లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. ప్రభుత్వ రంగంలో డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కళాశాలలు, వ్యవసాయ పరిశోధన కేంద్రం మంజూరు, హైదరాబాద్–న్యూఢిల్లీ మార్గంలో ఉన్న బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో సూపర్‌ఫాస్ట్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్‌కు చర్యలు, ఆడిటోరియం నిర్మాణం, శ్మశానవాటికల్లో, పోచమ్మ చెరువు వద్ద కర్మకాండల నిర్వహణకు షెడ్లు, ఆర్టీసీ బస్‌డిపో మంజూరు, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి, టీబీ రోగుల కోసం ఆసుపత్రి ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

పారదర్శకత పాటిస్తాం

బెల్లంపల్లి అభివృద్ధి కోసం వసూలు చేసిన చందా డబ్బులు బ్యాంకులో రూ.40 లక్షల వరకు పోగయ్యాయి. కమిటీ సభ్యుల్లో పలువురు మృతిచెందారు. వీరి స్థానంలో కొత్త సభ్యులను ఎన్నుకోవల్సి ఉంది. చందా డబ్బుల లెక్కలను ప్రజలకు త్వరలోనే బహిరంగ పరుస్తాం. దాపరికంగా వ్యవహరించం. పారదర్శకతను పాటిస్తాం.

– గోనే శ్యాంసుందర్‌రావు, అభివృద్ధి కమిటీ సభ్యుడు

కొత్త కమిటీని ఏర్పాటు చేయాలి

కొత్త కమిటీని ఏర్పాటు చేసి సరైన మార్గదర్శకం చేయాల్సిన అవసరం ఉంది. బెల్లంపల్లిలో వ్యవసాయ పరిశోధన కేంద్రం, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, పీజీ, బీఎడ్, మహిళా డిగ్రీ కళాశాలల మంజూరుకు కృషి చేయాల్సి ఉంది. సాంస్కృతిక కార్యక్రమాలకు ఆడిటోరియం, పేదలకోసం ఫంక్షన్ హాల్ నిర్మించాలనే డిమాండ్ ఉంది. చదువులో రాణిస్తున్న పేదవిద్యార్థులను ప్రోత్సహించడానికి ఆర్థిక సాయం అందించాలని పలువురు కోరుతున్నారు.

గత యూనియన్ల అలసత్వంతోనే సమస్యలు



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

రెబ్బెన(ఆసిఫాబాద్): గతంలో గుర్తింపు కార్మిక సంఘంగా పనిచేసిన యూనియన్ల అలసత్వంతోనే కార్మికుల అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ముష్క సమ్మయ్య అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని వివిధ డిపార్టుమెంట్లలో శనివారం ఏఐటీయూసీ గేట్ మీటింగ్‌లు నిర్వహించారు. ముఖ్య అతిథిగా వారు హాజరై మాట్లాడారు. సింగరేణి స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో యాజమాన్యంతో చర్చించిన అంశాలను కార్మికులకు వివరించారు. సొంత ఇల్లు పథకం అమలు, 200 గజాల ఇంటి స్థలం, పెర్క్స్‌పై ఐటీ యాజమాన్యం చెల్లించేలా చూస్తామని, కొత్త ఇన్సెంటివ్ విధానాన్ని ప్రవేశపెడతామని, గైర్హాజరు శాతం తగ్గించేందుకు ప్రతి మూడు నెలలకోసారి మాస్టర్ల ప్రతిపాదికన ప్రోత్సాహక బహుమతి ఇచ్చేవిధంగా యాజమాన్యంతో మాట్లాడామని అన్నారు. జూనియర్ అసిస్టెంట్స్ ప్రమోషన్ పాలసీలో మార్పులు, బదిలీ వర్కర్స్ విధానాన్ని ఎత్తివేసి జనరల్ మజ్దూర్‌గా అపాయింట్‌మెంట్ అయ్యే విధంగా చూస్తామన్నారు. డిస్మిస్ కార్మికులను వన్‌టైం సెటిల్‌మెంట్‌గా తీసుకునేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. సమావేశంలో గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు శేషు, జగ్గయ్య, రాజేష్, కిరణ్‌బాబు, ఆనంద్, దివాకర్, ఫిట్ కార్యదర్శులు శ్రీనివాస్, రామయ్య, అశోక్, నాయకులు ఓదెలు, శ్రీనివాస్, అంజయ్య, రాంకిషన్, గోపాల్, సురేష్‌కోరి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

సీఆర్టీల నిరవధిక సమ్మెకు మద్దతు


మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఉమ్మడి జిల్లాకు చెందిన సీఆర్టీలు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. శనివారం నాటికి సమ్మె 13వ రోజూ చేరింది. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఆదిలాబాద్ మాజీ జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్‌లు వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆరు నెలల వేతనాలు అందకపోవడంతో సీఆర్టీలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉద్యోగ క్రమబద్ధీకరణతోపాటు ప్రమాదంలో మృతిచెందిన సీఆర్టీలకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. తుడుందెబ్బ మహిళా నాయకురాలు పెందోర్ పుష్పరాణి, నాయకులు అలీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జలపాతం వద్ద 'బుల్లెట్‌రెడ్డి' షూటింగ్


పాట చిత్రీకరణలో హీరో, హీరోయిన్

బోథ్: మండలంలోని పొచ్చెర జలపాతం వద్ద శనివారం 'బుల్లెట్‌రెడ్డి'సినిమా షూటింగ్ నిర్వహించారు. జలపాతం అందాల మధ్య నిర్మాత , దర్శకుడు, హీరో ఆదిరెడ్డి, హీరోయిన్ హానికలకు సంబంధించి పాట చిత్రీకరించారు. జలపాతంతోపాటు అర్బన్ పార్కులోనే రెండు పాటలు పూర్తి చేశారు. తమకు సహకరించిన బోథ్ ప్రజలు, అధికారులకు హీరో ఆదిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

నాటిన మొక్కలకు ఆన్‌లైన్ నమోదు


యాప్‌లో నమోదు చేస్తున్న మాజీ సర్పంచ్

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(కే) గ్రామంలో మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి ఆధ్వర్యంలో నాటిన మొక్కలను శనివారం ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా నాటిన ప్రతీ మొక్కను ఫోన్ ద్వారా వనమాలి యాప్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి మొక్కకు ఒక్క బార్‌కోడ్ వస్తుందని, ప్రపంచంలో ఎక్కడ నుంచైన చూసే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలోనే ముఖరా(కే) గ్రామంలో మొక్కలను ఆన్‌లైన్ చేయడం తొలిసారని పేర్కొన్నారు.

చెట్లపొదల్లోకి దూసుకెళ్లిన కారు

ఆదిలాబాద్‌రూరల్: మావల సమీపంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్లపొదల్లోకి దూసుకెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాలు.. ఇచ్చోడ నుంచి పవన్, ప్రవీణ్‌లు కారులో శనివారం ఆదిలాబాద్‌కు వస్తున్నారు. మార్గమధ్యలో అదుపుతప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారికి చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

నారుమడుల్లో జాగ్రత్తలు పాటించాలి

- రైతులు సూచనలు పాటిస్తే దిగుబడులు


యామిని, ఏవో, చెన్నూర్


వరినారు మడిని పరిశీలిస్తున్న ఏవో

చెన్నూర్‌రూరల్: యాసంగి సీజన్‌లో వరి సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. కొందరు నారు పెంచేందుకు మడులు సిద్ధం చేసి విత్తనాలు చల్లారు. నారుమడుల పట్ల తగు జాగ్రత్తలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని చెన్నూర్ ఏవో యామిని వివరిస్తున్నారు. నారుమడుల్లో కలుపు, ముఖ్యంగా ఊద సమస్యలు ఎక్కువగా ఉంటాయి. దీని నివారణకు ఎకరా నారుమడికి బుటీక్లోర్ 1.5 లీటర్ తీసుకుని 200ల లీటర్ల నీటిలో కలిపి విత్తనాలు విత్తిన సమయంలో లేక, 8వ రోజున మడిలో పిచికారీ చేయాలి. లేదా విత్తిన 14 నుంచి 15 రోజుల్లో సైహలోపాప్ బ్యుటైల్ 10 శాతం 400మి.లీ. 200ల లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. నాట్లు వేసిన 4 నుంచి 5 రోజులకు ఎకరాకు 30–40 గ్రాముల ఆక్సిడయార్జిల్ 25 కిలోల ఇసుకతో కలిపి చల్లుకోవాలి. పిచుకలు, అడవిపందులు రాకుండా నారుమడికి నాలుగు వైపులా నాలుగు పొడవాటి కర్రలు ఏర్పాటు చేసి కవర్లు తొడగాలి. గాలివీచినప్పుడు కవర్లు చప్పుడు అయ్యి అవి దగ్గరకు రావు. లేదంటే కర్రలకు ఖాళీ సీసాతోపాటు నట్‌బుల్లోట్‌ను ఏర్పాటు చేయాలి. లేదా పాత పల్లానికి రంధ్రం చేసి దానికి బుల్లోట్ కట్టినట్లయితే గాలికి అవి కదిలి శబ్దానికి పిచుకలు, అడవిపందులు అటువైపుగా రావు. ఇలా చేస్తే రైతులు నారుమడులను కాపాడుకోవచ్చు.

తెలంగాణ ఉద్యమకారుడి మృతి


రాఘవులు (ఫైల్)

తానూరు: ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ఆమరణ నిరాహార దీక్ష చేసిన భోసి గ్రామానికి చెందిన ఉద్యమకారుడు రాఘవులు (75) శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. 2010 జనవరి 11న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొట్టమొదటగా తానూరు మండలం భోసి గ్రామంలో ఐదు రోజులు ఆయన ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. తెలంగాణ సాధనకు ఎంతో కృషిచేశారు. వయస్సు రీత్యా అనారోగ్యం బారినపడి నిజామాబాద్‌లోని ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంటుండగా మృతిచెందారు. ఆయన మృతిపట్ల ఉద్యమకారులు గ్రామస్తులు సంతాపం ప్రకటించారు. ఉద్యమ సమయంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు.